క్లుప్తంగా

అదుపుతప్పి బొలేరో వాహనం బోల్తా

తొట్టంబేడు: మండల కేంద్రమైన తొట్టంబేడు సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం రాత్రి బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ క్రమంలో పక్కన వెళ్తున్న బైక్‌కు తగలడంతో శ్రీకాళహస్తికి చెందిన తల్లీకొడుకులు నాగరత్నమ్మ, చరణ్ కింద పడి గాయపడ్డారు. వారు వరదయ్యపాళెం నుంచి శ్రీకాళహస్తికి బైక్‌లో వెళుతుండగా ప్రమాదం జరిగింది. వారిని స్థానికులు ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి


మాట్లాడుతున్న అరుణకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రాజెక్టు ప్రతినిధి అరుణ కుమారి తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న వంట నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ భోజనం తయారు చేసేవారు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని పాటించాలి


మతపెద్దలతో మాట్లాడుతున్న సీఐ గోపి


శ్రీకాళహస్తి: ప్రతి ఒక్కరూ మతసామరస్యాన్ని పాటించాలని 1వ పట్టణ సీఐ గోపి తెలిపారు. ఆయన శుక్రవారం 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలు, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలు శనివారం బక్రీద్ పండుగను జరుపుకోనున్న నేపథ్యంలో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా మతసామరస్యానికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముస్లింలు సంతోషంగా బక్రీద్‌ను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తున్న ఎంఈవో బాలయ్య

శ్రీకాళహస్తి: పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి సందర్భంగా నిర్వహించిన శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. ఇందులో పలు పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ముగింపు సమావేశానికి ఎంఈవో బాలయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తరగతి పుస్తకాలతోనే కాకుండా సామాజిక స్పృహ కలిగిన పుస్తకాలను కూడా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో రేవతి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ


రేణిగుంట సర్పంచ్ నగేషంను పరామర్శిస్తున్న గంగారి రమేష్

రేణిగుంట: రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నగేషం రెండు రోజుల క్రితం కాలుజారి పడడంతో మోకాళ్ల దెబ్బతిన్నాయి. ఆయన రేణిగుంట రైల్వే హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఆయనను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు, సీపీఐ నాయకుడు తులసిరాజన్, వడ్డిమిట్ట శ్రీకాంత్ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, ఏ అవసరం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు భరోసా ఇచ్చారు.

మరాఠి రైల్వే గేటు మూసివేత

పుత్తూరు: పట్టణంలో మరాఠి రైల్వే గేట్ (నెంబర్ 55)ను మరమ్మతుల నిమిత్తం మూడు రోజులు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే క్రాసింగ్ ట్రాక్ వద్ద గల చెక్‌రైల్ లెవల్ మరమ్మతుల కోసం గేటును ఈ నెల 6వ తేదీ రాత్రి 10 నుంచి 9వ తేదీ ఉదయం 6 గంటల వరకు మూసివేస్తున్నట్లు తెలిపారు. పుత్తూరు నుంచి నగరి వైపు రాకపోకలు సాగించే వాహనదారులు ఆర్డీఎం రైల్వే గేటు నెంబర్ 56 ద్వారా ప్రయాణించాలని సూచించారు.

కనిపించని ఆడబిడ్డ నిధి



సంపద సృష్టిస్తాం.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం అని చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పటిలాగే ఈసారి కూడా అమలుచేయకుండా మోసం చేశారని మహిళలు వాపోతున్నారు. 18 ఏళ్లు పైబడిన మహిళలందరికీ ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు సాధ్యం కాదని జగనన్న చెప్పినా వినకుండా కూటమి నేతలను నమ్మి ఓట్లు వేసి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఏడాది పూర్తయినా అమలుకు నోచుకోని పథకం
- బాబు ష్యూరిటీ.. లేదు గ్యారెంటీ
- మళ్లీ మోసపోయామంటున్న మహిళలు



వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో మహిళలకు కూటమి ప్రభుత్వం, ఆడబిడ్డ నిధి పథకం ద్వారా రూ.193 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఏడాది పూర్తవుతున్నా ఆ హామీని అమలు చేయకుండా మహిళలను మోసం చేసింది. 2024 జూన్ నాటి లెక్కల ప్రకారం సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎస్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో 18 ఏళ్లు నిండిన, ఆపై వయస్సు కలిగిన వారు 1,07,445 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.1500 చొప్పున నెలకు రూ.16,11,67,500 ప్రభుత్వం చెల్లించాలి. 12 నెలలకు రూ.193,40,10,000 చెల్లించాల్సి ఉంది. ఈ పథకం గురించి కూటమి ప్రభుత్వం ఆలోచన చేయకపోగా ఇంతవరకు పైసా చెల్లించలేదు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పేరిట ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒక్క పథకాన్ని కూడా ఇప్పటివరకు అమలు చేయలేదు. సంపద సృష్టిస్తానని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబుది మోసపూరిత నైజానికి ఇది నిదర్శనమని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	మహిళలు	చెల్లించాల్సిన ఆడబిడ్డనిధి సొమ్ము (నెలకు)
బీఎన్‌కండ్రిగ	12984	1,94,76,000
వరదయ్యపాళెం	18249	2,73,73,500
కేవీబీపురం	16936	2,54,04,000
నారాయణవనం	13737	2,06,05,500
పిచ్చాటూరు	12573	1,88,59,500
నాగలాపురం	13311	1,99,66,500
సత్యవేడు	19745	2,96,17,500

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారో చెప్పాలి



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ఎదురు చూస్తున్నాం. ఆడబిడ్డ నిధి ఏడాదిగా అమలు చేయలేదు. ఈ పథకం గురించి ఎంతగానో ఎదురు చూస్తున్నాం. దీని గురించి ఎక్కడా చర్చకు రాకపోవడం దారుణం. తక్షణమే ఆడబిడ్డ నిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేసేందుకు కసరత్తు చేయాలి.

–హరిప్రియ, నాగలాపురం మండలం

ఏడాదితో కలిపి మొత్తం చెల్లించాలి



అధికారంలోకి రాగానే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ. 1500 ఆర్థిక సాయం అందించి భరోసా కల్పిస్తానని బాబు చెప్పారు. ఇప్పటి వరకు ఆ పథకం గురించి సీఎం ఎక్కడా మాట్లాడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చంద్రబాబు మోసం చేస్తున్నాడని జగనన్న చెప్పినా వినకుండా ఓట్లు వేసినందుకు కూటమి ప్రభుత్వం బాగా బుద్ధి చెప్పింది.

–హెప్సీ, వరదయ్యపాళెం మండలం

మహిళల ఉసురు తగులుతుంది



గత ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారు. మహిళల పేరుతోనే పథకాలు అమలుచేశారు. కూటమి ప్రభుత్వం మహిళల ఓట్లతో గెలిచి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరి కాదు. మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే వారి ఉసురు తప్పక తగులుతుంది.

–దీప, వరదయ్యపాళెం మండలం

కూటమి ప్రభుత్వ భాగస్వాములు స్పందించాలి



చంద్రబాబు సీఎం అయ్యేందుకు ఆయనతో జత కట్టిన జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి స్పందించి సూపర్ సిక్స్ పథకాల అమలుకు కృషి చేయాలి. ఎన్నికల హామీలు అమలు చేయడంలో జరుగుతున్న జాప్యం గురించి ప్రశ్నించాలి. తక్షణమే ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500 చెల్లించే విధంగా కృషి చేయాలి.

–దేవిక, బీఎన్‌కండ్రిగ మండలం

ఘనంగా అర్జున తపస్సు మాను


ఏర్పేడు మండలం పాత వీరాపురంలో అర్జున తపస్సు

ఏర్పేడు: ఏర్పేడు మండలం పాతవీరాపురంలో జరుగుతున్న 5వ శ్రీకృష్ణ, ద్రౌపదీ ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు మాను కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంతానం లేని మహిళలు తపస్సు మాను వద్ద వరపడ్డారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సు మాను అధిరోహించారు. అతను విసిరిన నిమ్మకాయలను భక్తులు ప్రసాదంగా భావించి అందుకున్నారు. ఆదివారం అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ జెడ్పీటీసీ ముని రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, ఆలయ చైర్మన్ కొంగర కృష్ణారెడ్డి, ఆలయ పూజారి రవి, దొరస్వామి, బాలాజీ, మనోహర్, పాత గుంట మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై మెరుపు దాడులు

- జేసీబీ, ఆరు ట్రాక్టర్ల సీజ్
- అక్రమార్కులు తప్పించుకోవడంపై అనుమానాలు
- కిందిస్థాయి పోలీసు సిబ్బందిపై విమర్శలు

సాక్షి ఎఫెక్ట్..


పోలీసుల స్టేషన్ వద్ద సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

రేణిగుంట: రేణిగుంట మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై గాజులమండ్యం పోలీసులు శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించారు. జేసీబీ, ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. రేణిగుంట మండలం పిల్లపాల్యం సమీపంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై రేణిగుంట రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ సుధాకర్ స్పందించారు. తమ సిబ్బందితో కలిసి మెరుపుదాడులు చేశారు. జేసీబీ, ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న సూత్రధారులు తప్పించుకోవడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు స్టేషన్‌లోని కిందిస్థాయి సిబ్బంది ఇచ్చిన సమాచారంతోనే ఇసుకను రాష్ట్రాలు దాటిస్తున్న వారు తప్పించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టిప్పర్లతో ఇసుకను రాష్ట్రాలు దాటిస్తున్న స్థానిక వ్యక్తి కిందిస్థాయి సిబ్బందిని తమ చేతుల్లో పెట్టుకోవడం వల్లే పోలీసులు ఎప్పుడు దాడులు చేస్తున్నారనే సమాచారం క్షణాల్లో చేరిపోతోందన్న ఆరోపణలు వున్నాయి. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని అసలైన ఇసుక అక్రమార్కులను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

రేణిగుంట: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే మలేరియా బారిన పడకుండా ఉండొచ్చని వైద్యాధికారులు సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్రరావు, ఆశా కార్యకర్త చాముండేశ్వరి గాజులమండ్యం గ్రామంలోని నీలిసానిపేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల్లో మురుగు నీరు నిలువ ఉండకుండా చూడాలని పేర్కొన్నారు. డ్రమ్ములు, బిందెలు, వాడుకలోలేని టైర్లు, కుండలు, ప్లాస్టిక్ కప్పులు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయని వివరించారు.

నామకరణ వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు


వైఎస్సార్‌సీపి కార్యకర్త కుమారుడిని ఆశీర్వదిస్తున్న అంజూరు శ్రీనివాసులు

రేణిగుంట: మండలంలో కరకంబాడికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పీడీ దిలీప్ కుమారుడి నామకరణ మహోత్సవం శుక్రవారం వారి స్వగృహంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచనల మేరకు శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, డీసీసీబీ జిల్లా మాజీ అధ్యక్షుడు సిద్ధగుంట సుధాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిరుమల రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, రాయలసీమ విద్యా సంస్థల అధినేత ఆనందరెడ్డి, జువ్వల దయాకర్ రెడ్డి కరకంబాడికి వెళ్లి చిన్నారిని ఆశీర్వదించారు. సుబ్రమణ్యం, బాబురావు, శివకుమార్, వెంకటరత్నం, జయదేవ్, దీన, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ


చికిత్స పొందుతున్న పురుషోత్తం

తొట్టంబేడు: మండలంలోని బోనుపల్లిలో పొలంలో నీరు వదిలే విషయంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ విషయం మంగళవారం జరగ్గా ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. బోనుపల్లికి చెందిన పురుషోత్తం, జమునమ్మ, శిల్ప ఒకే కుటుంబీకులు. వీరి సమీప బంధువులతో పొలంలో నీరు వదిలే విషయంలో వివాదం నెలకొంది. వివాదం ముదిరి ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఇరు వర్గాల వారు గాయపడ్డారు. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఏరియా ఆస్పత్రికి చేరుకుని ఘటనకు గల కారణాలను ఆరా తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మొక్కలతోనే పర్యావరణం


మొక్కలు నాటుతున్న సంస్థ ప్రతినిధులు

రేణిగుంట: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అమరరాజా సంస్థ ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ కార్యనిర్వాహక అధికారి సి.నరసింహులు నాయుడు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కరకంబాడిలో వున్న అమరరాజా కంపెనీ పరిసరాల్లో మొక్కలు నాటారు. ఆపరేషన్ ఇండస్ట్రీస్ బ్యాటరీస్ డివిజన్ హెడ్ ఎం.శ్రీనివాసరావు, ఆటోమోటివ్ బ్యాటరీస్ డివిజన్ హెడ్ బి.మునీశ్వర నాయుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అండ్ సేఫ్టీ హెడ్ డాక్టర్ సదాశివన్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం పీఆర్ అతిథి గృహంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తన వద్దకు వచ్చిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతానని తెలిపారు. అర్జీలను అధికారులకు పంపించి చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తున్నట్టు వెల్లడించారు. తర్వాత అర్జీ ఏ స్థితిలో ఉందో ఫోన్ ద్వారా సంబంధిత వ్యక్తులకు తెలియజేస్తామని వివరించారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

రేణిగుంట: తన భార్య కనపడటం లేదని ఓ వ్యక్తి రేణిగుంట పోలీసులను ఆశ్రయించాడు. రేణిగుంట మండలం కరకంబాడి తారకరామా నగర్‌లో ఉంటున్న వ్యక్తి టాక్సీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం దంపతులు గొడవ పడ్డారు. 4వ తేదీ నుంచి భార్య కనిపించకుండా పోయింది. పలే చోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో భర్త శుక్రవారం సాయంత్రం రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఏవో ఘన సన్మానం


ఏవో త్రివిక్రమ్‌రావును సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న త్రివిక్రమ్‌రావు సత్యవేడు ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఆయనకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. పంచాయతీ కార్యదర్శులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ఏవో మోతి, ఈవోపీఆర్డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ముక్కంటిని దర్శించుకున్న తమిళ సినీ నటి



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం తమిళ సినీ హీరోయిన్ దర్శగుప్తా దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలికల వసతి గృహం ప్రారంభం


బాలికల వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంకు ప్రభుత్వ బాలికల వసతి గృహం మంజూరుకావడం శుభపరిణామమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆయన శుక్రవారం వరదయ్యపాళెంలోని అద్దె భవనంలో ఏర్పాటుచేసిన బాలికల వసతి గృహాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లల చదువుకు వసతి గృహం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడంతోపాటు అన్ని వసతులూ కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, వరదయ్యపాళెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రమణయ్య, పీడీ బందిల కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, నాయకులు జయచంద్ర నాయుడు, నరసరాజు, బీజేపీ నాయకులు గుత్తి త్యాగరాజు, మాజీ ఎంపీపీ భారతి, తడ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వంట నిర్వాహకులకు జీతాలు పెంచాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ యూనియన్ నాయకుడు చంద్ర

బుచ్చినాయుడుకండ్రిగ: మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు జీతాలు పెంచాలని ఆ యూనియన్ నాయకులు కోరారు. బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మధ్యాహ్న భోజన వంట నిర్వాహకుల యూనియన్ సమావేశం నిర్వహించారు. సత్యవేడు నియోజకవర్గ ఏఐటీయూసీ యూనియన్ నాయకులు చంద్ర మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచాలని తెలిపారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

వరదయ్యపాళెం: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు ఆంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం వరదయ్యపాళెంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశమయ్యారు. వారి సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. యూనియన్ నాయకురాలు మునిరాజమ్మ, జ్ఞానమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

బాలికకు ఆశీర్వాదం


బాలికను ఆశీర్వదిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: వైఎస్సార్‌సీపీ టీయూసీ చైర్మన్ ఏలుమలై కుమార్తె ఓనీల ఫంక్షన్ శుక్రవారం స్థానిక ఉమాపతి కల్యాణ మండపంలో జరిగింది. ఇందులో వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. బాలికను ఆశీర్వదించారు. నాయకులు బీరేంద్రవర్మ, భానుప్రకాష్‌రెడ్డి, చిన్నదొరై, అపరంజిరాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని ఓబులాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చూపారు. 2024– 25 విద్యా సంవత్సరంలో జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఆర్.జనీత్‌సాయి, బి.మునినిఖిత, డి.అనూష మంచి మార్కులు సాధించినట్టు ప్రధానోపాధ్యాయులు గోపి తెలిపారు. ఆయన శుక్రవారం వారిని అభినందించారు. వారికి కేంద్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలిరెడ్డి, జెడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ చెంచు కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.